సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 5 । జూలై । 2024



ప్రిన్సిపాల్ వద్దంటూ ధర్నా
ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్ వద్దంటూ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ధర్నా చేశారు. - 8లో



ప్రజా సేవకు విరమణ ఉండదు
ప్రజా సేవ చేసే ప్రజాప్రతినిధులకు పదవీ విరమణ ఉండదని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం / కనిష్టం
34^{0} / 25^{0}
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు సెలవు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు శుక్రవారం అమావాస్య కారణంగా సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సమయపాలన పాటించాలి



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి: అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం తదితర రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం డీఈఓను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ మల్లేష్, ఉపాధ్యాయులు మధుకర్, శోభారాణి, విమల, రమేష్, శ్రీరాములు, పుష్పావతి, వీరయ్య, నాగయ్య, సునంద, ప్రసన్నకుమారి, అంజలి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ బోర్డులు కనిపించేలా పెట్టాలి



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

తిరుమలగిరి (తుంగతుర్తి): ఎరువుల దుకాణాల్లో డీలర్లు తప్పనిసరిగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల స్టాక్ బోర్డులు రైతులకు కనిపించేలా పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులు ఈపాస్ మిషన్ ద్వారా అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈఓలు వెంకట్‌రెడ్డి, డీలర్లు ఈశ్వరయ్య, వెంకన్న, ఈశ్వర్, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవం, విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



కోదాడలోని స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

కోదాడ: స్కానింగ్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కోదాడలోని పలు ప్రైవేట్ వైద్యశాలలు, డయాగ్నోస్టిక్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, అబార్షన్లు చేయడం తీవ్ర నేరంగా పరిగణిస్తామన్నారు. పట్టణంలోని అర్చన నర్సింగ్ హోంలో అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేయడంతో వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆయన వెంట వెంకటరమణ, అంజయ్యగౌడ్ తదితరులున్నారు.



ఇది తిప్పర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం. ఇందులో 85 మంది విద్యార్థులున్నారు. భవనం శిథిలావస్థలో ఉండటమే కాకుండా గదులు, కిటికీలకు తలుపులు లేవు. బాత్రూం పరిసరాల్లో దట్టమైన చెట్ల పొదలు దర్శనం ఇస్తున్నాయి. రాత్రి సమయంలో బాత్రూమ్ వెళ్లాలంటే ప్రమాదకరమైన పరిస్థితి నెలకొంది.



ఇది ఆలేరు పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహంలో 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. బాత్రూంలు సరిగా లేవు. చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు మొలిచి పరిసరాలు అధ్వానంగా మారాయి. గదుల పక్కనే మురుగు నీరు పారుతుండటంతో దోమల బెడద ఉందని, దాంతో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



ఇది మునగాల మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్. ఇక్కడ 24 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ గదుల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగింది. రాత్రివేళల్లో పాములు, తేళ్లు వంటి విష కీటకాలు వస్తాయన్న భయంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇవే కాదు.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మెజారిటీ సంక్షేమ హాస్టళ్లలో ఇదే పరిస్థితి నెలకొంది.

హాస్టళ్లు.. అధ్వానం!

సంక్షేమ వసతి గృహాల నిర్వహణ గాలికి

- విరిగిన కిటికీలు, తలుపులు
- చెత్తా చెదారం, ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండిన పరిసరాలు
- విషపురుగుల సంచారం
- సూర్యాపేటలో అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి
- పాముకాటుతో మృతి చెందినట్లు అనుమానాలు!
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామంలోని ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వేసవి సెలవులు ముగిశాక హాస్టళ్లను తెరిచిన ప్రభుత్వం.. వాటి నిర్వహణ గాలికొదిలేసింది. హాస్టళ్ల పరిసరాలు చెత్తాచెదారం, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయి విష కీటకాలకు నిలయంగా మారాయి. వీటికి తోడు విరిగిన తలుపులు, కిటికీలు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న మెల్లం శ్యామ్‌కుమార్ అనే విద్యార్థి బుధవారం అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మంగళవారం అర్ధరాత్రి 2 గంటల తరువాత మూత్రానికి అని బయటకు వెళ్లిన శ్యామ్‌కుమార్.. రూమ్‌లోకి వచ్చాక వాంతి చేసుకొని, భయం వేస్తోందని తోటి విద్యార్థులకు చెప్పాడు. హాస్టల్ పరిసరాలన్నీ పిచ్చిమొక్కలు, కంప చెట్లతో ప్రమాదకరంగా ఉండటంతో పాము లేదా తేలు కాటుతో మరణించి ఉండొచ్చని తోటి విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ హాస్టళ్లలో విద్యార్థులు భద్రతకు యంత్రాంగం ప్రాధాన్యం ఇవ్వడం లేదు.

నెల కావొస్తున్నా విద్యార్థుల భద్రత గాలికే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) విద్యార్థుల భద్రతను ప్రభుత్వం గాలికొదిలేసింది. వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు, హాస్టళ్లు తెరిచి నెల రోజులు కావస్తున్నా మౌలిక వసతులు కల్పించడంలో యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు తంటాలు తప్పడం లేదు.



చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో అధ్వానంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పరిసరాలు

ప్రమాదాలకు నిలయాలుగా..

- ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు పూర్తిగా లేకుండా పోయాయి. హాస్టల్‌లో భవనాల చుట్టూ కంప చెట్లు పెరిగాయి. ఆవరణలో కనీసం రాత్రిపూట లైట్లు వెలిగే పరిస్థితి లేదు.ఎ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, స్థానిక అధికారులు నిర్లక్ష్యంతో హాస్టళ్లలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటు కాలం వెళ్లదీస్తున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ వరండాలో లైట్లు కూడా వెలగడం లేదు. మరుగుదొడ్లు కంపచెట్ల మధ్యలో ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. గదుల్లో కిటికీలు విరిగిపోయాయి. విద్యార్థులు పడుకోవడానికి బెడ్లు కూడా లేవు. పరుపులు చినిగిపోయాయి. హాస్టల్ వరండా మొత్తం గచ్చులు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది.
- చివ్వెంల మండలంలో సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. కుడకుడ, బి.చందుపట్ల, జి.తిర్మలగిరి గ్రామాల్లోని ఎస్సీ బాలుర హాస్టల్స్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కుడకుడ గ్రామంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఆరు బయట పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్నప్పటికీ, తలుపులు, నల్లాలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బి.చందుపట్ల గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో నీటి సదుపాయం సరిగా లేదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో మల విసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.



ఆత్మకూరు(ఎస్) మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థి చనిపోవడంతో ఆవరణలో తొలగించిన కంపచెట్లు



ఆత్మకూరులోని ఎస్టీ హాస్టల్ గదిలో విరిగిపోయిన కిటికీలు



ఆత్మకూరులోని ఎస్సీ హాస్టల్ భవన పిల్లర్‌కు వచ్చిన పగుళ్లు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు



హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: ప్రభుత్వ, మున్సిపాలిటీ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించొద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్‌ఐడీసీ) నిధులతో హుజూర్‌నగర్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోకపోతే అధికారులే ఇంటికి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నం చేశారని, ఇప్పుడు అలా జరగకుండా చూడాలన్నారు. కోర్టు కేసుల విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలని, అవసరమైతే గవర్నమెంట్ ప్లీడర్‌తో కేసు వెకేట్ చేయించి ప్రభుత్వ స్థలాలు కాపాడాలన్నారు. రింగ్ రోడ్డు పనులు, ఫణిగిరి గుట్ట వద్ద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన ప్రభుత్వ ఐటీఐ, మినీ స్టేడియం కోసం అనువైన స్థలాన్ని సేకరించాలని చెప్పారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. అక్రమ వెంచర్లు వేసిన వారిపై, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తొలుత మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శాలువ, పూలమాలలతో సన్మానించారు. అదేవిధంగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) ద్వారా శిక్షణ పొందిన మహిళలకు హుజూర్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాస రెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మున్సిపాలిటీ పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ వెంకటరెడ్డి, ఈఈ జీఆర్‌డీ ప్రసాద్, డీఈ రమాదేవి, ఏఈ స్వాతి, న్యాక్ ఏడీ రమేష్ కుమార్, ఇంచార్జి సుదర్శన్, ట్రైనర్ కృష్ణవేణి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

కోదాడ: అభివృద్ధి పనుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దని, యుద్ధ ప్రాతిపదికన టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం కోదాడ మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనులకు మున్సిపాలిటీకి రూ.20 కోట్లు మంజూరు చేయించానని, వాటికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే విధంగా చూడాలన్నారు. సమస్యలుంటే ఎమ్మెల్యే ద్వారా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా.. తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా. మున్సిపాలిటీ అభివృద్ధిపై మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశానికి పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు హాజరు కాలేదు. మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి భర్తలు సమావేశానికి హాజరుకావడం గమనార్హం. ఇక ఎలాంటి హోదా లేకపోయినా మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు వేదిక మీద కూర్చోవడం, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త సమావేశంలో పాల్గొనడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.



కోదాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నాగారంబంగ్లాలోని ఆర్‌అండ్‌బీ భవనాన్ని పరిశీలించేందుకు వస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నాగారం: నాగారంబంగ్లాలోని సూర్యాపేట–జనగాం జాతీయ రహదారి పక్కన ఆర్‌అండ్‌బీ నూతన భవన నిర్మాణానికి రూ.2కోట్లతో ఆర్‌అండ్‌బీ నుంచి నిధులు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం జనగాం జిల్లాలో జరిగిన దొడ్డి కొమరయ్య వర్ధంతికి హాజరై తిరిగి నల్లగొండకు వెళ్తున్న క్రమంలో కార్యకర్తల కోరిక మేరకు నాగారంబంగ్లా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ వద్ద కాసేపు ఆగారు. ఈ సందర్భంగా రహదారి బంగ్లా శిథిలావస్థకు చేరిందని కార్యకర్తలు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి నూతన గెస్ట్‌హౌజ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలోనే నాగారం మండలంలో పర్యటించి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని తెలిపారు. నాగారం గ్రామంలో 200 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దోనకొండ రమేష్, జాజుల వీరయ్య, గుంటకండ్ల ముకుందారెడ్డి, పాశం యాదవరెడ్డి, కొలిపాక సాయికుమార్, బుక్క శ్రీను, బిక్కి శ్రీను, కడారి సోమయ్య, కొంపెల్లి శ్రీను, ఉపేందర్ నరేష్, నర్సిరెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ, మెయిన్స్‌కు సన్నద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు గురువారం తెలిపారు. టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో జూలై 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జూలై 21న ఎంట్రన్స్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదని పేర్కొన్నారు. ఈ పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షకు ఉచిత వసతి భోజనంతో పాటు 10 నెలలు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సూర్యాపేటటౌన్: నీట్ పేపర్ లీకేజీ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి గురువారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైనట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. సూర్యాపేటలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి, నీట్ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల బంద్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మద్దతు ప్రకటించారు. కార్యక్రమాల్లో ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, పీవైఎల్ సంఘాల నాయకులు గోపగాని రవి, పుల్లూరి సింహాద్రి, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, వినయ్, బండి రవి, భరత్, వినోద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొలువుదీరిన ప్రత్యేకాధికారులు

- మండల, జిల్లా పరిషత్‌లకు ముగిసిన పాలకవర్గాల గడువు
- మున్సిపాలిటీలు మినహా అన్నింటా ప్రత్యేకాధికారుల పాలన
- గ్రామ పంచాయతీల్లో ఫిబ్రవరి నుంచే అమలవుతున్న ప్రత్యేక పాలన



పెన్‌పహాడ్ మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాములు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలోని స్థానిక సంస్థల్లో ప్రత్యేకాధికారుల పాలన కొలువుదీరింది. మున్సిపాలిటీలు మినహా అన్నింటా పాలకవర్గాల గడువు ముగిసింది. అయితే ఇప్పట్లో స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన తప్పలేదు. ఫిబ్రవరి నుంచే గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించగా.. ఈనెల 3వ, 4వ తేదీల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల గడువు ముగిసింది. దీంతో ఇంతకాలం ఎంపీపీ, జెడ్పీటీసీలుగా పనిచేసిన వారంతా మాజీలుగా మారారు. ఈ క్రమంలో మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ 23 మండలాలకు ప్రత్యేక అధికారులుగా జిల్లాస్థాయి అధికారులను నియమించారు. ఇక జెడ్పీ చైర్మన్ స్థానంలో కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

గ్రామపంచాయతీలు	475
ఎంపీపీ స్థానాలు	23
జెడ్పీటీసీ స్థానాలు	23
ఎంపీటీసీ స్థానాలు	213

ప్రత్యేక పాలన ఇలా..

జిల్లాలో 23 మండలాలు, 475 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 213 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 23 మంది ఎంపీపీలు, జెడ్పీటీసీలు జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఐదు నెలల క్రితం సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం మండల స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించింది. ఇక్కడ పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ ఆఫీసర్ అనుమతితో గ్రామాల్లో పనులు నిర్వహిస్తూ, సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఈనెల 3వ తేదీ నుంచి మండల పరిషత్, 4వ తేదీ నుంచి జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా ముగియడంతో మండలాలకు ప్రత్యేక అధికారులుగా జిల్లాస్థాయి అధికారులను నియమిస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ ఉత్తర్వులు జారీచేశారు.

స్పెషల్ ఆఫీసర్ల అనుమతులు తప్పనిసరి

మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా.. మొదటగా మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ఆమోదం పొందాల్సి ఉంది. మండల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో పాటు స్థానికంగా వచ్చే ఆదాయాన్ని ఎంపీడీఓలు డ్రాయింగ్ అధికారిగా ఖర్చు చేయొచ్చు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘాల ద్వారా అందించే నిధులను ఎంపీడీఓలతో పాటు ఎంపీపీలు సంయుక్తంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంది. మండలంలో ఎలాంటి పనులు చేపట్టలన్నా తప్పనిసరిగా ప్రత్యేక అధికారి అనుమతిని ఎంపీడీఓలు పొందాల్సి ఉంటుంది. నూతనంగా పాలకవర్గాలు కొలువుదీరే వరకు రాజకీయంతో సంబంధం లేకుండా మండలాల్లో అధికారుల పాలనే కొనసాగనుంది.

క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

భువనగిరి రూరల్: భువనగిరి మండల పరిధిలోని స్వర్ణగిరి దేవాలయంలో భక్తుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు కనిపెట్టి గురువారం అతడికి అప్పగించారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కొల్లురు నవీన్ జూన్ 21న స్వర్ణగిరి దేవాలయానికి వచ్చి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా డు. పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఐఎంఈఐ నంబర్ ఆధారంగా సెల్‌ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి అప్పగించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

హుజూర్‌నగర్ (చింతలపాలెం): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దొండపాడు పశువైద్య కేంద్రంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న పెరుమాళ్ల మోషయ్య (51) కార్యాలయ ఆవరణలో కొక్కేనికి చీరతో ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి మోషయ్య తండ్రి వీరయ్యకు తెలుపగా అతడు వచ్చి చూసేసరికి మోషయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన మోషయ్య పదేళ్లుగా కుటుంబ సభ్యులకు దూరంగా ఒక్కడే ఉంటున్నాడు. మృతుడి తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొలం కంచె ధ్వంసం.. ఇద్దరిపై కేసు నమోదు

శాలిగౌరారం: వ్యవసాయ భూమి తగాదాలో భూమి సరిహద్దులో నాటిన రాతి కడీలను ధ్వంసం చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామానికి పగడాల నారాయణ, పగడాల అరుణకు సర్వే నంబర్ 91లో 1.04 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి చుట్టూ రాతి కడీలతో కంచె ఏర్పాటు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన కుందూరు వెంకటనర్సయ్య కుటుంబ సభ్యులు తమకు కూడా సర్వే నంబర్ 91లో వ్యవసాయ భూమి ఉందని నారాయణ, అరుణ కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో పగడాల నారాయణ, అరుణ తమ పొలం చుట్టూ వేసుకున్న కంచెను కుందూరు వెంకటనర్సయ్య, కుందూరు గోపి ధ్వంసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటనర్సయ్య, గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదే భూ తగాదాలో 2024 ఏప్రిల్ 3న ఆస్తి ధ్వంసానికి పాల్పడిన వెంకటనర్సయ్య, శ్యాం, గోపి, నరేశ్, సుభాష్, రామనర్సమ్మపై కేసు నమోదైన విషయం విదితమే.

కోదాడను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అనంతగిరి: నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అనంతగిరి: రాష్ట్రంలోనే కోదాడ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం అనంతరగిరి మండల కేంద్రంలో తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించలేకపోయిందన్నారు. అనంతగిరి మండలంలో తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ కార్యాలయాలకు ఒక్కో భవనానికి రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నూతన భవనాల డిజైన్, అలైన్‌మెంట్, లొకేషన్ వంటి విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను ఆదేశించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కొన్ని అనివార్య కారణాలతో ఢిల్లీలోనే ఉండడంతో ఈ కార్యక్రమానికి రాలేకపోయారని అన్నారు. అదే విధంగా కోదాడ–ఖమ్మం రోడ్డుని జాతీయ రహదారిగా మంజూరు చేయించినట్లు తెలిపారు. మండలంలోని శాంతినగర్ నుంచి చనుపల్లి వరకు సింగిల్ రోడ్డును రూ.20కోట్లతో డబుల్ రోడ్డుగా మంజూరు చేశామన్నారు. కోదాడ మున్సిపాలిటీలో రూ.20 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్, టౌన్ హాల్‌తో పాటు ఇతర పనులు వేగవంతం చేయడానికి సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కోదాడ పట్టణంలో మైనారిటీల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందరరావు, కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ పవన్‌కుమార్, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, జెడ్పీటీసీ కొణతం ఉమ, ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, బాణోతు బాబునాయక్, గుర్రం వెంకటరెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

‘స్వర్ణగిరి’ని దర్శించుకున్న చినజీయర్‌స్వామి



శ్రీవారి పాదాలకు పూజలు చేస్తున్న చినజీయర్‌స్వామి

భువనగిరి: మండల పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని గురువారం చినజీయర్ స్వామి దర్శించుకున్నారు. స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి మురళీకృష్ణ, గోపి కృష్ణ, అహోబిల రామానుజజీయర్‌స్వామి, దేవనాథ్ జీయర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని సన్మానిస్తున్న బొల్లెపల్లి గ్రామస్తులు

భువనగిరి రూరల్: మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో రూ.11.64లక్షలతో చేపట్టిన మందులవారి కమ్యూనిటీ హాల్‌కు యాదాద్రి భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, మాజీ వైస్ ఎంపీపీ మోడుపు శ్రీనివాస్‌గౌడ్, గడ్డమీది వీరస్వామి, జిట్ట కృష్ణారెడ్డి, వంటెద్దు కుమార్, సామెల్, విద్యా కమిటీ చైర్మన్ హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గోపాలమిత్రలు



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గోపాలమిత్రలు

నల్లగొండ టౌన్: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లగొండ జిల్లాకు చెందిన గోపాలమిత్రలు హైదరాబాద్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. 23 సంవత్సరాలుగా పశుసంవర్ధక శాఖలో సేవలు అందిస్తున్నామని తమను పశుసంవర్ధక శాఖలో ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గోపాలమిత్రల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మాద గోయిన రవీందర్, జేఏసీ నాయకులు పల్స మహేశ్వర్, ముడావత్ దశరథ, రామకృష్ణ, బందయ్య, బుచ్చిరెడ్డి, శివరామకృష్ణ, ఎండీ ఫరూక్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో కాంగ్రెస్ నేత మృతి

- నివాళులర్పించిన మంత్రి కోమటిరెడ్డి



సైదిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్: మండల పరిధిలోని బాబాసాహెబ్ గూడేనికి చెందిన నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త సైదిరెడ్డి(50) గురువారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాబాసాహెబ్‌గూడేనికి చేరుకొని సైదిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సైదిరెడ్డి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో నల్లగొండ మున్సిపాలిటీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, మాజీ జెడ్పీటీసీలు మందడి రామచంద్రారెడ్డి, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, వంగూరి లక్ష్మయ్య, మాజీ ఎంపీపీలు కే. అంజిరెడ్డి, జి. భిక్షంయాదవ్, నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యాదాద్రీశుడి ఆదాయం రూ.23.91కోట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జూన్‌లో రూ.23,91,09,020 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు గురువారం వెల్లడించారు. గతేడాది జూన్ మాసంతో పోల్చుకుంటే.. ఈ ఏడాది జూన్ లో రూ.7,55,04,058 అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. ప్రసాద విక్రయం ద్వారా రూ.4,85,71,780, ఇతర పూజల ద్వారా రూ.11,23,27,064, హుండీల ద్వారా రూ.3, 48,12,940, వీఐపీ దర్శనం ద్వారా రూ.1, 90,95,450, ఆర్జిత సేవల ద్వారా రూ.87, 54,503, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.80,49,900, వ్రత మండపం ద్వారా రూ.36,14,200, విచారణ శాఖ ద్వారా రూ.38,83,183 వచ్చిందని వివరించారు. జూన్‌లో 54,213 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారన్నారు. 508 బస్సుల ద్వారా 9,56,514 మంది భక్తులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించామన్నారు. గిరి ప్రదక్షిణ దారిలో మరమ్మతులు చేశామన్నారు. 1000 మందికి నిత్యాన్నదానం చేస్తున్నామన్నారు. స్థానికులకు ప్రతి మంగళవారం ఉదయం 8.30గంటల నుంచి 9గంటల వరకు ఆధార్‌కార్డును చూసి సంప్రదాయ దుస్తులతో గర్భాలయ దర్శనం కల్పించామన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్లపై సూచనలు

భువనగిరి: ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్లపై టీశాట్ నెట్‌వర్క్ ద్వారా ఈ నెల 6వ తేదీన సూచనలు ఇవ్వనున్నట్లు డీఈఓ కె. నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆవిష్కరణలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడానికి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి 2024–25 సంవత్సరానికి గాను నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం నామినేషన్లు వేసే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సూచనల కోసం శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీశాట్ నెట్‌వర్క్‌లో టెలికాన్ఫరెన్స్ వీక్షించాలని కోరారు. మరింత సమాచారం కోసం 9000989726 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద గురువారం పోలీసులు పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా బొలేరో వాహనంలో తరలిస్తున్న సుమారు 40 నుంచి 45 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

ప్రిన్సిపాల్ వద్దంటూ విద్యార్థినుల ధర్నా



ధర్నా చేస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

సూర్యాపేట: తమను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్ తమకు వద్దంటూ సూర్యాపేట మండలం బాలెంల సమీపంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు గురువారం సూర్యాపేట–జనగామ రహదారిపై ధర్నా చేపట్టారు. ప్రిన్సిపాల్ శైలజ తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, భోజనం సరిగ్గా పెట్టడం లేదని ఆరోపించారు. అడిగితే చేయి చేసుకుంటుందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను వేధిస్తున్న ప్రిన్సిపాల్ వద్దని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అడ్డగూడూరు: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటను సంబంధించి ఇరువర్గాలపై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు అడ్డగూడూరు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన దుర్సోజు రవీందర్‌చారి అదే గ్రామానికి చెందిన సట్టు రవి భార్య సట్టు శైలజను ఏడాది కాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయాన్ని శైలజ తన భర్త రవితో చెప్పగా అతడు బుధవారం తన సోదరుడు సట్టు పరుశురాములుతో పాటు మరికొంత మందితో కలిసి దుర్సోజు రవీందర్‌చారి ఇంటికి వెళ్లి ప్రశ్నించాడు. దీంతో రవీందర్‌చారి భార్య రాజేశ్వరి బూతులు తిట్టి సట్టు శైలజ, సట్టు రవిని నెట్టి వేసింది. దీంతో సట్టు శైలజ రవీందర్‌చారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే సట్టు రవి, శైలజ తదితరులు తమ ఇంటిపై దాడి చేశారని రవీందర్‌చారి, అతడి భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా కొంతమంది నాయకులు ఫిర్యాదు విషయంలో రాజీపడాలని బలవంతం చేస్తున్నారని రవీందర్‌చారి ఆరోపించారు. కాగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడైన రవీందర్‌చారిని సస్పెండ్ చేస్తున్నట్లు బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

రవీందర్‌చారి భార్య ఆత్మహత్యాయత్నం..

తన భర్తపై లైంగిక ఆరోపణలు రావడం, గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఆయనను తొలగించడం, ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని కొందరు ఒత్తిడి తీసుకొస్తుండడంతో మనస్తాపానికి గురైన రవీందర్‌చారి భార్య రాజేశ్వరి గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయన్నం చేసింది. చికిత్స నిమిత్తం ఆమెను తిరుమలగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషయంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ సభ్యులను కలుసుకున్న నాగయ్య



కుటుంబ సభ్యులతో నాగయ్య

నిడమనూరు: మండలంలోని గుంటుకగూడేనికి చెందిన తరి నాగయ్య ఓ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవించి గురువారం హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలు నుంచి విడుదలై గ్రామానికి చేరుకుని తన భార్య, కుమార్తెను కలుసుకున్నాడు. 2009లో తన మూడేళ్ల కొడుకును కిందపడేసి కొట్టి చంపినందుకు ఆయన 14సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించాడు. క్షణికావేశంలో నేరాలు చేసి శిక్షపడి, సత్ప్రవర్తనతో ఉన్న వారిని ప్రభుత్వం విడుదల చేయడంతో ఆయన బయటకు వచ్చారు.

నిజాయితీతో పనిచేస్తేనే జర్నలిస్టులకు గుర్తింపు

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



మాట్లాడుతున్న విరాహత్ అలీ

కొండమల్లేపల్లి: జర్నలిస్టులు నిజాయితీ, అంకిత భావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు పొందుతారని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. గురువారం కొండమల్లేపల్లి మార్కెట్ యార్డులో నిర్వహించిన దేవరకొండ డివిజన్ వర్కింగ్ జర్నలిస్టుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అనంతరం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్ రావు, నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పులిమాడు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, గాదె గిరిధర్ రావు, శ్రీనివాసరెడ్డి, దుండిగళ్ల అశోక్, ముత్యాలు, ఎడర్, బూడిద శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మెడలో బంగారు ఆభరణాలు చోరీ

నాగార్జునసాగర్: స్కూటీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో నివాసముంటున్న రూపారెడ్డి పెద్దవూర జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. గురువారం సాయంత్రం పాఠశాల అయిపోయిన తర్వాత స్కూటీపై ఆమె నాగార్జునసాగర్‌కు వెళ్తోంది. మార్గమధ్యలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వెళ్తూ ఆమె స్కూటీకి దగ్గరగా వెళ్లడంతో ఆమె భయపడి వేగంగా ముందుకెళ్లింది. విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత అక్కడ కొందరు మనుషులు ఉండడంతో స్కూటీ వేగాన్ని తగ్గించింది. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వెనుక నుంచి వచ్చి రూపారెడ్డి మెడలోని 2తులాల నల్లపూసల గొలుసు, 2తులాల చైన్‌ను లాక్కొని పారిపోయారు. ఆమె వెంటనే విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల్లో నిందితుల చిత్రాలను గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



రాఘవేంద్రచారి (ఫైల్)

మర్రిగూడ: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్‌ఐ కె. రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సరంపేట గ్రామానికి చెందిన కొండోజు రాఘవేంద్రచారి (32) మాల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తన సమీప బంధువు రామలింగాచారి వద్దకు వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆయిల్ ఫాం నర్సరీ సమీపంలో సరంపేట, రాంరెడ్డిపల్లి గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తెల్లవారుజామున స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాఘవేంద్రచారి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఉషారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చందంపేట మండలం యాపలపాయతండాలో గురువారం జరిగింది. యాపలపాయతండాకు చెందిన కేతావత్ మంగ్తానాయక్(56) తన వ్యవసాయ భూమిలో పత్తి విత్తనాలు నాటాడు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు గతంలో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే గురువారం తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దేవరకొండ ఆస్పత్రిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



అనిల్ (ఫైల్)

చందంపేట: వ్యవసాయ భూమిలో స్ప్రింక్లర్లు బిగిస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. చందంపేట మండల కేంద్రానికి చెందిన కోమళ్ల రాములు, కళమ్మ దంపతుల కుమారుడు కోమళ్ల అనిల్(22) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. వ్యవసాయంలో తండ్రికి చేదోడువాదోడుగా ఉండేందుకు స్వగ్రామానికి వచ్చిన అనిల్ గురువారం తన వ్యవసాయ భూమిలో స్ప్రింక్లర్లను బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. గురువారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి తిరుపతికి వెళ్లేందుకు అనిల్ అన్ని సిద్ధం చేసుకున్నాడు. అంతలోనే విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నామమాత్రంగా మద్దతు ధరలు పెంచారు



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

భువనగిరి టౌన్: డాక్టర్ స్వామినాథన్ కమిటీ సూచనల మేరకు పంటల మద్దతు ధరలను పెంచకుండా నామమాత్రంగా పెంచారని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. గురువారం అఖిల భారత కిసాన్ సభ ఇచ్చిన పిలుపు మేరకు భువనగిరిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధర పెంపు కేవలం కంటి తుడుపు చర్యగా ఉందన్నారు. పంటల పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయించాలి డిమాండ్ చేశారు. కేంద్రం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని అన్నారు. వరి క్వింటాల్‌కు కేవలం రూ.117 మాత్రమే పెంచడం ద్వారా రైతులు ఏవిధంగా లాభపడతారని ప్రశ్నించారు. పత్తికి క్వింటాల్‌కు రూ.2024 పెంచాల్సి ఉండగా అతినామమాత్రంగా పెంచారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, గీతపనివారల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గోదా శ్రీరాములు, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా మాజీ నాయకుడు యానాల దామోదర్‌రెడ్డి, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, గీతపనివారల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్ట రమేష్, రైతు సంఘం నాయకులు సోమన ఐలయ్య, సుర్కంటి సాయిరెడ్డి, జక్కా దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- తల్లితో కలిసి భర్తను కొట్టి చంపిన భార్య

కందుకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య తన తల్లితో కలిసి భర్తను హతమార్చింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లికి చెందిన కంచుకుట్ల పరమేశ్(37) మొదటి భార్య మృతి చెందడంతో మండలంలోని కొత్తగూడకు చెందిన చుక్కమ్మ కుమార్తె స్వప్నను 12 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పరమేశ్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ హైదరాబాద్ అల్మాస్‌గూడలో నివసిస్తున్నారు. కాగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో స్వప్న మూడేళ్ల క్రితం పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చింది. పరమేశ్ తరచూ మద్యం తాగి కొత్తగూడకు వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈవిషయంలో పలుమార్లు పెద్దల వద్ద పంచాయితీతో పెట్టడంతోపాటు పోలీసులకు సైతం స్వప్న ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి మరోసారి మద్యం తాగి భార్య వద్దకు వచ్చిన పరమేశ్ ఆమెతో గొడవకు దిగాడు. దీంతో విసుగు చెందిన స్వప్న.. తన తల్లి చుక్కమ్మతో కలిసి కర్రలతో పరమేశ్‌ను కొట్టి చంపింది. మృతదేహాన్ని కొంత దూరంలోని ప్రభుత్వ పాఠశాల వెనక పక్కన ఓ వ్యవసాయ క్షేత్రంలో పడేసి వెళ్లారు. గురువారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వప్న, చుక్కమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రావణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా తండ్రి మరణించడం, తల్లి, అమ్మమ్మ జైలుకు వెళ్లనుండటంతో ఇద్దరు పిల్లలు అక్షయ(7), లిఖిత(5) అనాథలయ్యారు. అక్షయ ఒకటో తరగతి, లిఖిత అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్నారు. వీరి ఆలనా పాలనా ఎవరు చూసుకుంటారో ప్రశ్నార్థకంగా మారింది.